క్లుప్తంగా

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి

గాలివీడు : అంగన్వాడీ పాఠశాలలకు వచ్చే చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని ఎంపీడీఓ చంద్రమౌళి అన్నారు. నూలివీడు పరిధిలోని ఇందిరమ్మ కాలనీ అంగన్వాడీ సెంటర్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారాన్ని చిన్నారులకు క్రమం తప్పకుండా అందజేయాలని తెలిపారు. విద్యార్థుల హాజరు పట్టిక పరిశీలించారు. టీచర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఓబులవారిపల్లె : ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఎంఈఓ శివరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో నూతన ఎంఈఓగా శివరామిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య, మధ్యాహ్న భోజనం పథకాలను అమలు చేయడమే లక్ష్యమన్నారు.

ఎంఈఓగా బ్రహ్మయ్య

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట ఎంఈఓ–2గా బ్రహ్మయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభాకర్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో చింతరాజుపల్లి పాఠశాల హెచ్ఎం మేరీని ఇన్‌చార్జిగా నియమించారు. రెగ్యులర్ ఎంఈఓ–2గా బ్రహ్మయ్యను నియమిస్తూ బుధవారం రాత్రి అధికారులు ఉత్తర్వులను జారీ చేశారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా

రైల్వేకోడూరు అర్బన్ : అనంతరాజుపేట ఇందిరానగర్‌లో గత రెండురోజులుగా తాగునీరు లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇది తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ బండారు మల్లికార్జున తన సొంత నిధులతో గురువారం ఆ గ్రామానికి ట్యాంకర్‌తో నీరందించి దాహార్తి తీర్చారు.

ఆగస్టు 3న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడి రాక

రాయచోటి టౌన్ : సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు ఆగస్టు 3న రాయచోటికి వస్తారని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు తెలిపారు. పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాలుగు లక్షల మంది కార్మికులు ఉన్నారని, వారి సమస్యలపై చర్చించేందుకు ఆయన వస్తున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్మికులంతా సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవీ.రమణ, బీవీ.రమణ, సుబ్రహ్మణం రాజు, ఆదినారాయణరెడ్డి, కాయల విశ్వనాథ్, కల్యాణ్ పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వద్దు

ఓబులవారిపల్లె : మండలంలో ఎరువుల కొరత లేకుండా చూడాలని, రైతులు అడిగిన వెంటనే సరఫరా చేయాలని తహసీల్దారు యామినీరెడ్డి కోరారు. మండలంలోని ఎరువుల దుకాణాలను గురువారం ఆమెతోపాటు ఏవో మల్లిక పరిశీలించారు. దుకాణంలో రికార్డులను, ఎరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

రాయచోటి జగదాంబసెంటర్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు బీటీఏ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్‌రజాక్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రామచంద్ర కోరారు. స్థానిక కొత్తపేట బీటీఏ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ ప్రకటించలేదని, 11వ పీఆర్‌సీ బకాయిలు ఇంతవరకూ విడుదల చేయలేదని అన్నారు.

ఆ స్థానాన్ని కైవసం చేసుకోవాలి

ఒంటిమిట్ట : చిత్తశుద్ధితో పనిచేసి ఉప ఎన్నికల్లో ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ.జనార్దన్‌రెడ్డి సూచించారు. ఒంటిమిట్ట హరిత గెస్ట్ హౌస్‌లో కూటమి నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. అభ్యర్థి ఎంపిక విషయంలో పలువురు నేతలు అభిప్రాయాలను సేకరించారు. అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి అభ్యర్థిని ఎంపిక చేస్తామన్నారు.

సమస్యకు పరిష్కారం

గాలివీడు: మండలంలోని తూముకుంట గ్రామ సమీపంలో పశువులు వెళ్లే రహదారి సమస్యను తహసీల్దారు భాగ్యలత, ఎస్‌ఐ రామకృష్ణ, సోలార్ డీఈ శివశంకర్‌నాయుడు కలిసి గురువారం పరిష్కరించారు. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి దారి ఇవ్వాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని సోలార్ అధికారులకు సూచించారు. సోనీ నాయక్, బద్దే నాయక్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి

ఓబులవారిపల్లె : పదో తరగతి ఉత్తీర్ణులైన పిల్లలను ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో చేర్పించాలని ప్రిన్సిపల్ హరిత పేర్కొన్నారు. చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలేకరులతో గురువారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తారని, పక్కా భవనాలు, విశాలమైదానం, అన్ని వసతులతో అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో చేర్పేందుకు ఉన్న అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పూల సాగు.. ఆదాయం బాగు

- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు
- శ్రావణమాసంలో మార్కెట్లో గిరాకీ


రైతులు సాగు చేసిన బంతిపూల తోట

రాయచోటి జగదాంబసెంటర్: సంప్రదాయ పంటలతో నిత్యం నష్టపోతున్న రైతులు ఇప్పుడు ఇతర పంటల సాగుపై దృష్టిపెడుతున్నారు. శ్రావణ మాసం కావడంతో మార్కెట్‌లో పూలకు మంచి డిమాండ్ ఉండడం, కొత్తరకం పూల సాగులో లాభాలు వస్తుండడంతో రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని అనేక ప్రాంతాల్లో బోర్లు, బావులు, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పూల తోటలు సాగు చేశారు. గత ఏడాది వరి, వేరుశనగ తదితర పంటలు సాగు చేసి అప్పుల పాలైన రైతులు ఇపుడు బంతి, నాటు చామంతి, మల్లిపూలు, కనకాంబరం సాగు చేస్తున్నారు. ఈ ఏడాది హైబ్రీడ్ వెల్వెట్, హైబ్రీడ్ చామంతి, కొత్తగా పసుపు, తెలుపు రంగు గులాబీ పూల తోటల సాగు పెరిగింది. మంచి గిరాకీ ఉన్నపుడు వ్యాపారస్తులే తోట వద్దకు వచ్చి ముందుగా అడ్వాన్స్ ఇచ్చి పూలు తీసుకుపోతున్నారు. ధర ఆశాజనకంగా ఉండడంతో మరిన్ని కొత్త రకం పూల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మార్కెట్లో మంచి గిరాకీ

ప్రస్తుతం మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న పూలనే ఎంచుకుని సాగు చేస్తున్నారు. హైబ్రీడ్ చామంతి, వెల్వెట్ పూల రకాల సాగుకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు, మ్యారీ గోల్డ్, మ్యారీ పింక్ సాగుకు ఎకరానికి రూ.90 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఎకరా భూమికి పది నుంచి 12 వేల మొక్కలు అవసరమవుతున్నాయి. నర్సరీల్లో పది వేల మొక్కల ధర రూ.25 వేల నుంచి రూ.29 వేలు, బాడుగతో సహా రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఎరువులు, దుక్కులు, కూలీలు, పురుగు మందుల ఖర్చు కలిపితే గరిష్టంగా రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. మంచి దిగుబడి వస్తే ఎకరానికి ఐదు టన్నుల పూలు కాస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో హైబ్రీడ్ చామంతి, గులాబీ పూల ధరలు కిలో రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. మల్లెలు, కాకడ పూలు కిలో రూ.50 నుంచి రూ.60 వరకు ఉంది. కనకాంబరం కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ధర పలుకుతోంది. శ్రావణమాసం కాడంతో ధరలు మరింత పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మల్లెల సాగుతో లాభాలు

నేను ఎకరా భూమిలో మల్లెపూల తోట సాగు చేశాను. ఖర్చు రూ.50 వేలు అయింది. ఆదాయం లక్షన్నర రూపాయలు వచ్చింది. రోజూ పూలు తీసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నా. కిలో మల్లె మొగ్గలు రూ.65 నుంచి రూ.75 ధర పలుకుతున్నాయి.

– సతీష్‌కుమార్, వరిగ గ్రామం, రాయచోటి మండలం



పూల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం

పలు గ్రామాల్లో పూలతోటల సాగుపై హార్టికల్చర్, వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయితే రైతులు పూల తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వివిధ రకాల పూలతోటలు సాగు చేసి కొందరు ఆదాయం పొందుతున్నారు.

– రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి, రాయచోటి

కిచెన్ గార్డెన్ల నిర్వహణలో అక్రమాలు


ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్ : కిచెన్ గార్డెన్ల నిర్వహణలో అక్రమాలు పెరిగాయని, విచారణ సాగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ, ఏపీఎస్‌జెఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఏడీని గురువారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా డీఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల అమృత్‌తేజ, ఏపీఎస్‌జేఏసీ రాయలసీమ జిల్లాల కన్వీనర్ వి.ఉత్తన్న మాట్లాడుతూ ప్రభుత్వం కిచెన్ గార్డెన్ల నిర్వహణకు రూ.5 వేల నిధులు మంజూరుచేసిందన్నారు. జిల్లా వ్యాప్తంగా మదనపల్లె, పీలేరు, నిమ్మనపల్లె, వాయల్పాడు ప్రాంతాలలోని కొన్ని పాఠశాలల్లో మాత్రమే నిధులు ఉపయోగించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కనీసం 20 శాతం వినియోగించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్‌కుమార్, ఏపీఎస్‌జెఏసీ జిల్లా అధ్యక్షుడు రాజ, గోవర్ధన్‌నాయుడు, సిద్ధారెడ్డి, నాగేంద్ర నాయుడు, వెంకటరమణ నాయుడు, మహ్మద్ హమీద్, రమణారెడ్డి, సంతోష్ నాయుడు, సాయి పాల్గొన్నారు.

హిందీ సాహిత్యంలో ఆదర్శప్రాయుడు ప్రేమ్‌చంద్


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాజంపేట టౌన్ : హిందీ సాహిత్యంలో దివంగత ప్రేమ్‌చంద్ అందరికీ ఆదర్శప్రాయుడని ఎంఈఓ–2 సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో ప్రేమ్‌చంద్ జయంతి గురువారం నిర్వహించారు. ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ తన రచనలతో యదార్థవాద సాహిత్యానికి నాంది పలికారన్నారు. సమాజంలో దురాచారాలను రూపుమాపేందుకు ప్రేమ్ చంద్ కృషి ఎనలేనిదని తెలిపారు. ప్రేమ్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జులై 20న నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విజేతలైన ఎస్.హనీఫా (జెడ్పీ హైస్కూల్, ఊటుకూరు), ఎస్. సబీరా సుల్తానా(జెడ్పీ హైస్కూల్, మన్నూరు), బి.కార్తీక(ఎస్‌బీవీడీ సభ పాఠశాల, పుల్లంపేట)లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ఆర్.నవ్యశ్రీ (జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, రాజంపేట), ఎం.శశిప్రియ (ఆదర్శ పాఠశాల, పుల్లంపేట)లకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాషా, రాజశేఖర్ పాల్గొన్నారు.

కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న మావులూరి విశ్వనాథ్

గాలివీడు : గుట్టకు వెళ్లే దారిని కబ్జా చేసి రైతులను ఇబ్బందులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. కొర్లకుంట గ్రామం పుల్లారెడ్డి గారి పల్లె చెరువు మరువగుట్ట వద్ద సర్వే నెంబర్ 432, 1999లో 3.22 ఎకరాలు మద్దిరాల గంగులమ్మ పేరుతో గుట్టు చప్పుడు కాకుండా పట్టా చేయించుకున్నారని ఆయన తెలిపారు. 2009 వరకు ఆ విషయం మిగతా రైతులకు తెలియదని, 2010లో విషయం తెలుసుకున్న రైతులు పిటీషన్ వేయడంతో అప్పట్లో రెవెన్యూ అధికారులు స్పందించి 2014లో పట్టా రద్దు చేశారన్నారు. ఆ భూమిపై ఎలాంటి హక్కు లేని మద్దిరాల గంగులమ్మ కుమారులు మద్దిరాల రాజారెడ్డి, విశ్వనాథరెడ్డి నేడు రాజకీయ అండతో కబ్జా చేసేందుకు జేసీబీతో చదును చేయిస్తున్నారన్నారు. రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిలిపేశారని, అయినా ప్రయత్నాలు ఆపడం లేదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.రఘునాథ నాయుడు, బాధిత రైతులు పాల్గొన్నారు.

వలస కార్మికుల వివరాలు చెప్పండి

రాయచోటి టౌన్ : ఇతర ప్రాంతాల నుంచి రాయచోటి పట్టణంలోని పని చేసేందుకు వచ్చిన కార్మికుల వివరాలు అర్బన్ స్టేషన్‌లో తెలియజేయాలని రాయచోటి అర్బన్ సీఐ బీవీ.చలపతి ఓ ప్రకటనలో కోరారు. రాయచోటి అర్బన్ పరిధిలోని హోటళ్లు, బార్‌లు, రెస్టారెంట్స్, షాపింగ్‌మాల్స్, ఇతర సంస్థలలో పని చేసేందుకు చాలామంది కార్మికులు వచ్చారన్నారు. వారి పేరు, తల్లిదండ్రుల పేర్లు, మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీ, ప్రస్తుత చిరునామా, ఆధార్ నకలు వెంటనే సమర్పించాలని సూచించారు. సరైన వివరాలు అందించకపోతే ఆ యజమానిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా శివశంకర్‌రాజు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా శివశంకర్‌రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా తిరుచానూరు నుండి రైల్వేకోడూరుకు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ దుకాణదారులు రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పాఠశాల తనిఖీ

పుల్లంపేట : మండలంలోని సీతారాంపేట అంగన్‌వాడీ పాఠశాలను ఎంపీడీఓ జయశ్రీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. 11 మంది విద్యార్థులకు గానూ 8 మంది హాజరయ్యారని, విద్యార్థుల సంఖ్య ఇంకా పెంచాలని సూచించారు. చిన్నపిల్లలపట్ల అంగన్‌వాడీ టీచర్, ఆయా శ్రద్ధ చూపాలన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల మాజీ సర్పంచ్ మద్దిరేవుల రాజారెడ్డి(75) బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. నిత్యం ప్రజలతో మమేకమైన ఆయన సర్పంచ్‌గా ఉత్తమ సేవలందించారని స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు రెడ్డివారిపల్లిలో రాజారెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ బీమా అవసరం

గాలివీడు : ప్రతి ఒక్కరూ ఏదో ఒక బీమా సౌకర్యం కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గాలివీడు బ్రాంచ్ మేనేజర్ శేషం ప్రకాష్ అన్నారు. తూముకుంట పంచాయతీ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎంఎస్‌బీవై, పీఎంజేజే , బీవై, ఏపీవై పథకాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దరెడ్డెయ్య, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సర్వసాధారణం


జయప్రకాష్‌ను సన్మానిస్తున్న పశుసంవర్ధకశాఖ అధికారులు


ఏఎస్‌ఐను సన్మానిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


జయలలితకుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు


శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : పదవీ విరమణ సర్వసాధారణమేనని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై అన్నారు. రాయచోటి డివిజన్ పరిధిలో లైవ్ స్టాక్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన డాక్టర్ జయప్రకాష్‌ను గురువారం ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుణశేఖర్‌పిళ్లై మాట్లాడుతూ మట్లి గ్రామ రైతులు ఆయన సేవలకు మెచ్చి బంగారు ఉంగరాన్ని బహూకరించడం చూస్తుంటే ఆయన ప్రజలతో, పాడి రైతులతో ఎంత మమేకమయ్యారనే విషయం అర్థం అవుతోందన్నారు. ప్రతి అధికారి నిక్కచ్చిగా విధులు నిర్వర్తిస్తే ప్రజలు గుండెల్లో పెట్టుకొంటారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీడీ డాక్టర్ మాలకొండయ్య, ఏడీలు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి : పదవీ విరమణ పొందిన ఏఎస్‌ఐ శ్రీనివాసులు సేవలను పోలీసు యంత్రాంగం గుర్తుంచుకుంటుందని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు అన్నారు. అన్నమయ్య జిల్లా పోలీస్ విభాగంలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన వాయల్పాడు పీఎస్ ఏఎస్‌ఐకు గురువారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు, సన్మానం నిర్వహించారు. ఉద్యోగులు శ్రీనివాసులుకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తే ప్రజలు గుర్తుంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎం.వెంకటాద్రి, ఆర్ఐ వీజే.రామకృష్ణ, ఎం.తులసీరాం, పి.రాజరమేష్, కె.రాజారెడ్డి, బి.అమర్‌నాథ్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సిద్దవటం : విద్యా వ్యవస్థలో నైతికత, సేవాభావం కలిగిన ఆదర్శ ఉపాధ్యాయులు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తారని బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్ అన్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి, ఉపాధ్యాయుడు సుబ్బరాయుడులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఒక మంచి ఉపాధ్యాయుడు జీవితాంతం విద్యార్థుల మనసులో నిలిచిపోతాడన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సహచరులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం.సమీర్‌బాషా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబల్లి : విద్యార్థులకు చదువు చెప్పే ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని ఎంఈఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని కృష్ణమయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన శ్రీనివాసులురెడ్డిని గురువారం వీరబల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ సమాజంలో గురువుకున్న స్థానం మరి ఎవరికీ లేదని, గురువు నేర్పిన విద్య ఉన్నతస్థానానికి తీసుకువెళ్తుందని తెలిపారు. అనంతరం పదవీ విరమణ పొందిన శ్రీనివాసులురెడ్డి దంపతులను ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఘనంగా సత్కరించారు. మండలంలోని ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


పాత చిట్వేలిలో స్వామి కల్యాణం

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో జులై 27న ప్రారంభమైన ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. గురువారం ప్రాతఃకాల పూజ అనంతరం ఉదయం నాలుగు గంటల నుంచి లక్ష్మీదేవి, గోదాదేవీ, ఆంజనేయ, జయ, విజయ, ధ్వజస్తంభ, బలిపీఠముల ప్రతిష్ట నిర్వహించారు. అంతకు ముందు జీవ కళాన్యాసం, ప్రాణప్రతిష్ట, కలశో ద్యాసన, పూర్ణాహుతి, పెద్దఎత్తున మోరుగోష్టి, నేత్రోన్మీలనం, దేను దర్శనం, కూష్మాండ బలి, ఆలయ బలిహరణం, సర్వ దర్శనం, కుంబాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం 11.30గంటలకు శాంతి కళ్యాణం, అన్నమయ్య సంకీర్తన జరిగాయి. మధ్యాహ్నం స్థానిక బ్రహ్మంగారి మఠం ధర్మకర్త కట్టా రామమోహన్‌రావు అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి చొరవతో పునరావాసం

రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు


భూమి పూజ కార్యక్రమంలో కొరముట్ల శ్రీనివాసులురెడ్డి

ఓబులవారిపల్లె : మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చొరవతో మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు రూ.400 కోట్లతో పునరావాసం కల్పించామని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఆర్‌ఆర్–5 నందు దాదాపు కోటి రూపాయల వ్యయంతో రామాలయ నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. అంతకు ముందు మంగంపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, తల్లెం భరత్ కుమార్ రెడ్డి, గ్రామస్తులు, మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వత్తలూరు సాయికిశోర్ రెడ్డి, టంగుటూరు కృష్ణారెడ్డి, ముద్దా బాబుల్‌రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, మినుగు సుధాకర్, గోపీనాథ్, కొలూరు నారాయణ రెడ్డి, ఆర్‌వీ.రమణ, కొలూరు రమణారెడ్డి, గుజ్జల శ్రీనివాసులురెడ్డి, దేవకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం

మంగంపేట ఆర్‌ఆర్–5 నందు నిర్మిస్తున్న రామాలయానికి రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ముక్కా వరలక్ష్మీ దంపతులు రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముక్కా సాయివికాష్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబుకు పులివెందుల ఎమ్మెల్యే అంటే భయమెందుకో?


మాట్లాడుతున్న పాపినేని విశ్వనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి పులివెందుల ఎమ్మెల్యేనే కదా.. మరి సీఎం చంద్రబాబు నాయుడుకు అంత భయమెందుకో? తెలియడంలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా చంద్రబాబు నాయుడు ఆయన పర్యటనను విఫలం చేసేందుకు ఎన్నో కుయుక్తులు పన్నుతున్నారన్నారు. ప్రజాదరణ ముందు బాబు కుయుక్తులు పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. దేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా జగన్ పర్యటనలో ప్రజలను అదుపుచేసేందుకు బౌన్సర్లను పెట్టడం ఆయనపై ప్రజలకున్న అభిమానాన్ని తెలియజేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో 90 శాతానికి పైగా కుటుంబాలకు జగన్ ప్రవేశ పెట్టిన పథకాలతో మేలు జరిగిందని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ 175 స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని మహిళలు గుర్తించారన్నారు. అందువల్లే కూటమి ప్రభుత్వంపై ఏడాదికే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటి టౌన్ : పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. రాయచోటి డైట్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రౌండ్‌లో 175 మొక్కలు నాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యంతో భూతాపం పెరుగుతోందని అన్నారు. ఇంటి చుట్టూ మొక్కలు పెంచాలని, ఇంటి నిర్మాణ సమయంలోనూ మొక్క పెంచేందుకు స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. శిలాజాల ఇంధనం వాడకం తగ్గించి దాని స్థానంలో సౌరశక్తి బయోగ్యాస్ ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, ఉషా మాధురి, గిరిబాబు యాదవ్, శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కలీముల్లా, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై లాఠీచార్జి చేయడం దారుణం

రాయచోటి టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని చూసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఇది ఓర్వలేక కూటమి ప్రభుత్వం పోలీసులతో వారిపై లాఠీచార్జి చేయిస్తోందని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రనాయక్ చౌహాన్ విమర్శించారు. నెల్లూరు జిల్లాలో పర్యటనలో భాగంగా వెళ్లిన జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు వేలాది మంది తరలివచ్చారన్నారు. కూటమి నాయకులు ప్రజలపై కక్షకట్టి దారుణంగా లాఠీలతో కొట్టించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాదరణ చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం, ఆంక్షలు విధించడం, పోలీస్ బలగాలను మోహరించడం, ప్రజలను అడ్డుకోవడం, భయభ్రాంతులకు గురిచేయడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం కూలిపోవడం ఖాయమనిపిస్తోందని అన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం సాగిస్తామని హెచ్చరించారు.

ఎంఈఓలుగా స్కూల్ అసిస్టెంట్ల నియామకం సరికాదు


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

లక్కిరెడ్డిపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎంఈఓ–1 పోస్టుల్లో గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను నియమించడం సరికాదని ఆపాస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు అన్నారు. స్థానిక జాండ్రపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో గురువారం వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ–2 స్థానంలో గెజిటెడ్ హోదా కల్గిన జెడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్లు పని చేస్తున్నారని, ఇప్పుడు నాన్ గెజిటెడ్ హోదా కల్గిన గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓ–1 స్థానంలో కూర్చోపెట్టడం తీవ్ర అన్యాయమన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న సహాయకులు నిర్మించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెజిటెడ్ హోదా కలిగిన వారిని నియమించాలి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ నాయకులు

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంఈవో–1 పోస్టులను ప్రభుత్వ మేనేజమెంట్‌లో పని చేస్తున్న పాఠశాల సహాయకులను నియమించడం ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని ఏపీయూఎస్(ఆపస్) రాష్ట్ర కార్యదర్శి పోగుల వెంకట్రామిరెడ్డి అన్నారు. రాష్ట్ర రవాణ, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో గురువారం ఆయన కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంఈవో–2 స్థానంలో గెజిటెడ్ హోదా కలిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పని చేస్తున్నారని తెలిపారు. నాన్ గెజిటేడ్ హోదా కలిగిన ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్లను ఆ స్థానంలో కూర్చోబెట్టడం అన్యాయమన్నారు.

సీజనల్ జ్వరాలపై అవగాహన కల్పించండి


బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

సిద్దవటం : ప్రజలకు జ్వరాలపై అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ తెలిపారు. మండలంలోని మూలపల్లె గ్రామంలో సర్పంచ్ ఆవుల వెంకటసుబ్బమ్మ ఆధ్వర్యంలో గురువారం ఆమె పర్యటించారు. చేతిపంపు వద్ద పంచాయతీ కార్యదర్శి రియాజ్ బ్లీచింగ్ పౌడర్ చల్లించి, క్లోరినేషన్ చేయించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మనోరమ మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు వస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి రంగలక్ష్మి, ఇండ్లు సుబ్బరాయుడు, మౌలాలి, వెంకటసుబ్బయ్య, వాసవి, రెడ్డిరాణి పాల్గొన్నారు.